

నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలి : వేమిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :బిల్డర్స్ నిబంధనలకు లోబడి నాణ్యమైన నిర్మాణాలను ప్రజలకు అందించాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ వారిచే స్థానిక కస్తూరిదేవి గార్డెన్స్ నందు నిర్వహించుచున్న హోమో ఎక్స్‌ఫోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎక్స్‌ఫోలో ప్రదర్శించబడుతున్న ప్రతి స్టాల్‌ను ఆయన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వారు ప్రతి ఒక్కరు లే అవుట్స్ ను ఖచ్చితముగా అప్రూవల్ చేయించుకోవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ ప్రెసిడెంట్ డి. రామకష్ణ, గ్రీవెన్స్ ఛైర్మన్ డి. రాజశేఖర్ నాయుడు, సెక్రటరీ టి. మధుసూదన్, ఉపాధ్యక్షులు ఎమ్ రామమూర్తి రెడ్డి, టి. నరేంద్రరెడ్డి, జాయింట్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జనం కోసం మాట్లాడే..

ఒక్క ప్రజా ప్రతినిధి ఎవరు..?

ఒకప్పుడు ఉద్యమనేతలు..ఉద్దండ నేతలు..జనం కోసం మాట్లాడి, పోట్లాడేవారు. అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ఓట్లేసి గెలిపించిన జనం కష్టాల్లో, ఇబ్బందుల్లో ఉంటే గళమెత్తి మాట్లాడే పరిస్థితులు కనిపించేవి. గతంలో కాంగ్రెస్, టిడిపి, బిజెపి, వైసిపి ప్రజాప్రతినిధులైనా మా గురించి మా మంత్రి, ఎంపి, ఎంఎల్ఎ, మేయర్, జెడ్‌పి ఛైర్మన్, ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచ్ మాట్లాడారని గ్రామాల్లో చెప్పు, రచ్చబండలపై రైతులు,ప్రజలు వల్లించుకునే పరిస్థితులు కనిపించేవి. ఇప్పుడు అలాంటివి మచ్చుకైనా కనిపించడం లేదు. నాలుగేళ్ల నుంచి జిల్లాలో రైతులకు మద్దతు ధర లభించలేదు. ఒక్క ప్రజా ప్రతినిధి పట్టించుకోలేదు.. ఐఎబి సమావేశాల్లో జరిగితే సాగునీటి కోసం సమావేశాల్లో అడిగినవారు లేరు. నెల్లూరు కార్పొరేషన్‌లో వందలు పైగా అక్రమ లేవుట్లు ఉంటే ప్రశ్నించిన పరిస్థితి లేదు..సివిల్ సప్లయ్‌లో భారీ కుంభకోణం జరిగితే పట్టించుకున్న ప్రజాప్రతినిధులు కనిపించలేదు. వీరా మన నేతలంటూ జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

- ◆నాలుగేళ్ల నుంచి ఇదే పరిస్థితి
- ◆రైతుకు మద్దతు ధర పట్టదు..ఐఎబిలో నీటి పంపిణీ కనబడదు..
- ◆అక్రమ లేవుట్ గురించి మాట్లాడరు... సివిల్ సప్లయ్ అవినీతి గురించి ప్రశ్నించరు..
- ◆ఇది మన ప్రజా ప్రతినిధుల పరిస్థితి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సింహపురికి ఉద్యమాల చరిత్ర ఉంది. సారా , పొదుపుతోపాటు అనేక పోరాటాలకు పెట్టింది పేరు. ప్రజలతోపాటు, ప్రజా ప్రతినిధులు ముందుండి నడిచేవారు. అధికారపార్టీలో ఉన్నా, ప్రతిపక్ష పార్టీలో ఉన్న జనం సమస్యలు మాత్రమే చూసేవారు. అందుకు అనేక మంది నేతలు మార్గదర్శిలుగా ఉండేవారు. 'రావాలి జగన్...కావాలి జగన్' అంటూ జనం 2019 ఎన్నికల్లో ఆపార్టీకి ఘన విజయం ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇద్దరు ఎంపిలు, 10 మంది ఎంఎల్ఎలు, జెడ్‌పి ఛైర్మన్, 46 మంది జెడ్‌పిటిసిలు, మేయర్, ఛైర్‌పర్సన్‌లతోపాటు భారీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు దాదాపు 90 శాతం వైసిపి పక్షాన గెలిచారు. రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు ఏ పార్టీకి ఇంతటి మెజార్టీ రాలేదు. ప్రజలు తమకేమైనా సమస్యలు వస్తే, ప్రజా ప్రతినిధుల చట్టసభలు, సమావేశాల్లో మాట్లాడి సాధించి పెడతారని నమ్మారు. ఇప్పుడు జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. జెడ్‌పిటిసి సమావేశాల్లో మాట్లాడడం లేదు. ఐఎబి సమావేశానికి మంత్రి, కలెక్టర్ తప్ప ఎవరూ రావడం లేదు. అధికారపక్ష ప్రజా ప్రతినిధులైనా తమకు ఓట్లేసి గెలిపించిన ప్రజా సమస్యలు మాట్లాడాల్సిన అవసరం ఉంది. ప్రశ్నిస్తే ప్రభుత్వానికి వ్యతిరేకత అనుకుంటారనో, మళ్లీ ఎన్నికల వరకు ప్రజలను పట్టించుకోనవసరం లేదనే భావమో తెలియద గాని, ఒక్క ప్రజా ప్రతినిధి జనం సమస్యలపై ముందుకు రావడం లేదు. ప్రజలు. రైతులు తమ బాధలు, ఇబ్బందులు మౌనంగా భరిస్తున్నారు..

ఐఎబి అంటే అంత అలుసా..?

ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) కీలకమైన సమావేశం, జిల్లాలో సోమశిల, కండలేరు ప్రాజెక్టు కింద భారీగా సాగు సాగుతోంది. తొలి పంటకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా రెండో పంట విషయంలో డెల్టా, నాన్‌డెల్టా అంటూ రైతులు సాగునీటి కోసం గొడవలు పడతారు. కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వంలో అధికార పక్ష ఎంఎల్‌ఎలే నువ్వా..నేనా అన్నట్లు వివాదం జరిగేది. మా ప్రాంతానికి, అంటే మాప్రాంతానికి అంటూ గొడవలు పడేవారు. రైతులు బయట ఆందోళనకు దిగే పరిస్థితులుండేవి. ఐఎబిని ఒక్క ఎంపి, ఎంఎల్ఎ పట్టించుకోవడం లేదు. ఇటీవల రెండో పంటకు నీరు కేటాయింపుల విషయంలో సమావేశం నిర్వహించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు సమయానికి వచ్చి చర్చించడానికి కూర్చునా ఒక్క కందుకూరు ఎంఎల్ఎ తప్ప, ఎవరూ రాలేదు. ఆయన వచ్చి వెళ్లిపోయారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన లెక్కలు ఫైనల్ చేశారు. తమకు నీరు వస్తుందా? రాదా తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దతు ధర గురించి మాట్లాడరా...?

రైతులను ఎన్నో ఏళ్ల నుంచి మద్దతు ధర కలగానే మిగిలిపోతుంది. కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వంలో ధర కోసం ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి వరకు రాయబారాలు సాగించేవారు. కొద్దిలో కొద్దిగానైనా న్యాయం జరిగేది. రెండు కార్లకు సంబందించి సుమారు 40 లక్షల పుట్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర విషయాన్ని పట్టించుకోకుండా మిల్లర్లు, దళారులు వారికి నచ్చిన ధర ఇచ్చి ప్రతేడాది కోట్లాది రూపాయాల రైతుల



శ్రమను దోచుకుంటున్నారు. ఈ ఏడాది పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ మసూరి, బిపిటికి మంచి ధర లభించింది. ఇదే సమయంలో నెల్లూరు మసూరకు ధర రాలేదు. సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగుచేసి, సరైన ధర రాక రైతులు ఆందోళన చెందారు. ఈ విషయాలపైనా జిల్లాలో ఒక్క ప్రజా ప్రతినిధి మాట్లాడిన పరిస్థితులు కనిపించలేదు. కనీసం వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చర్చించిన సందర్భాలు లేవని చెప్పాలి. డెల్టా, నాన్ డెల్టా రైతాంగం నానా ఇబ్బందులు పడుతుంటే కనీసం పట్టించుకునే నాధుడే కనిపించలేదు..

అక్రమ లేవుట్లలో ఎవరి పాత్ర ఎంత ?

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధిలో ఇటీవల కాలంలో విచ్చల విడిగా అక్రమ లేవుట్లు వెలిశాయి. అనధికార లెక్కల ప్రకారం 200 వరకు ఉంటాయని చెబుతుండగా, అధికారికంగా 118 ఉన్నట్లు ఆశాఖ అధికారులు గుర్తించారు. పేద, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కల కోసం అప్పులు చేసి, బ్యాంకుల్లో బంగారం కుదువపెట్టి ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇప్పుడు అది అక్రమ లేవుట్లు అని తెలియడంతో కంటిపై కునుకుపట్టడం లేదు. వందల కోట్లు అవినీతి జరిగిందని తెలుస్తోంది. ఎప్పటి నుంచో ఈ తతంగం సాగుతున్నా జిల్లాలో ఒక్క ప్రజా ప్రతినిధి నోరు మెదపడం లేదు. ప్రజలు ఇంత కష్టాల్లో ఉంటే వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ప్రజలు మాత్రం ఆందోళన చెందుతున్నారు. అక్రమ లేవుట్‌ల్లో ఎవరి వాట వారు తీసుకొని నోరు మెదపడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇది వాస్తవమే అనేలా ప్రజా ప్రతినిధులు, అధికారుల పనితీరు ఉందని విమర్శలు వస్తున్నాయి.

అవినీతిని ప్రశ్నించరా..?

రైతులకు సంబందించి సివిల్ సప్లయ్‌లో భారీ కుంభకోణం జరిగింది. 2015 నుంచి 2022 వరకు సుమారు రూ.100 కోట్లు అవినీతి జరిగిందని తెలుస్తుం డగా, అధికారులు రూ.43 కోట్లగా తేల్చారు. కలెక్టర్ విచారణ జరిపి, 33 మందిపై కేసులు పెట్టి, అరెస్ట్ చేశారు. ఆ సొమ్ము రికవరీ పూర్తి స్థాయిలో సాగలేదు. ప్రభుత్వం ఏసిబి విచారణకు అదేశించింది. రాష్ట్ర వ్యాపితంగా ఈ కుంభకోణం సంచలనం కలిగించింది. జిల్లాలో ఒక్క అధికారపార్టీ ప్రజా ప్రతినిధులకు పట్టలేదు. కనీసం ప్రశ్నించాలనన్న ఆలోచన రాలేదు. అనేక సార్లు సమావేశాలు జరిగినా ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక్క ఎంఎల్ఎనైనా మాట్లాడాతారని ఎదురుచూస్తున్నారు. నెల్లూరు రూరల్, వెంకటగిరి, ఉదయగిరి ఎంఎల్ఎలు ఇప్పుడు మాట్లాడుతున్నారు. అధికారపార్టీతో ఉన్నప్పుడు మౌనంగానే ఉన్నారని విమర్శలున్నాయి. ఒకప్పుడు గ్రామాల్లో రచ్చబండలు, చెట్లకింద కూర్చొని పత్రికలు చదివి మాట్లాడుకునే వారు. ఇప్పుడు చేతిలోకి సెల్ వచ్చాక ప్రతి క్షణం మాట్లాడుకుంటున్నారు. ఇలాంటి ప్రజా ప్రతినిధులునా మనం ఎన్నుకుంది అనే ఆవేదన మాత్రం జనంలో కనిపిస్తోంది. రాజకీయాలు పక్కన పెట్టి, ప్రజా సమస్యలపై మాట్లాడే, నిలదీసే ఒక్క ప్రజా ప్రతినిధి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయాలి

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలోని ప్రసూతి ఆసుపత్రిలో లిఫ్ట్‌లకు మరమ్మ తులు చేసి ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులోకి తీసుకు రావాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరం లోని ఎసిఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ప్రభుత్వ వైద్యశాలలోని ప్రసూతి, చిన్నపిల్లల విభాగం ఎదుట డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు చెందిన ప్రసూతి, చిన్నపిల్లల విభాగానికి వైద్యం కోసం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గర్భిణీలు, బాలంతలు వస్తుంటా రన్నారు. వైద్యం కోసం వచ్చిన మహిళల్లో పెద్ద ఆపరేషన్ చేయించుకొని నడవలేని పరిస్థితిలో ఉండే మహిళలు ఉంటా రన్నారు. ఈ మహిళలు వైద్యపరీక్షలు చేయించుకున్న అనంతరం ఆరోగ్య రీత్యా ప్రసూతి విభాగంలోనే ఉండి చికిత్సలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో డెలివరీ అయిన మహిళలు వార్డులలో ఉండి చికిత్స ల నిమిత్తం డాక్టర్ల వద్దకు వెళ్ళాల్సి ఉంటుందని, ఆ సమయంలో లిప్టులు పనిచేయక పోవడం కారణంతో మహిళల బాదలు వర్ణణా తీతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం కోసం వస్తున్న వారికి కనీస సౌకర్యాలు సైతం లభించకపోవడం శోచనీయ మన్నారు. ప్రభుత్వ వైద్యశాల అధికారులు, జిల్లా అధికారులు వెంటనే స్పందించి ప్రసూతి, చిన్న పిల్లల విభా గంలో లిప్టలకు మరమ్మత్తులు చేయించి రోగులకు అందు బాటులోకి తీసుకు రావాలన్నారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళన చేపడుతామన్నారు. సిపిఎం నాయకులు కొండా ప్రసాద్, డివైఎఫ్ఐ నాయ కులు కండే కోటేశ్వ రరావు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు సంతోష్, సుకు మార్, సనత్, కృష్ణ , డి.రాజు,దయాకర్ ఉన్నారు

ధర్నా చేస్తున్న దృశ్యం

సామాజిక న్యాయం కావాలి

ఇండియన్ లాయర్ అసోసియేషన్

ప్రజాశక్తి-నెల్లూరు లీగల్ : సామాజిక న్యాయం కోసం ఎస్‌టి, ఎస్‌సి, ఓబిసి, బలిజ కాపు, మైనారిటీల న్యాయవాదులు ఐక్యపరిచి రక్షణ కోసం రాజ్యాంగ ప్రాథమిక హక్కులు రాజ్యాంగ పరిరక్షణకు రిజర్వేషన్ సక్రమంగా అమలుపరిచే విధంగా ఈ సంస్థ ఏర్పడిందని రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.శాంత కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ పిపి డిఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ ఏదైనా సమస్య సంభవించినప్పుడు దాని పరిష్కారం కోసం న్యాయవాదులందరూ తమ వంతు కషి చేస్తే అది పరిష్కారమవుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరీలో కూడా సామాజిక బాధ్యత చొరవ అవసరమన్నారు. సమాజంలో న్యాయవాదులు పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. ఆ విషయాన్ని ఎవరు మర్చిపోకూడదని మరోసారి గుర్తు చేశారు. కార్యక్రమంలో కాకి శాంత కుమార్, హానర్బల్ ప్రెసిడెంట్ తన్నీరు కోటయ్య, కుడుముల రవి కుమార్, గుంటి సురేష్ బాబు, విష్ణు, జి.సురేష్, నరసయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని ప్రసంగించారు.

మాట్లాడుతున్న వక్తలు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :అక్షయ తతీయ పర్వదిన సందర్భంగా సత్యసాయి జ్యూవెలర్స్ యజమాని కాకుమాని మురళీకష్ణయ్య కుమారుడు ప్రవీణ్ కుమార్ సహాయ సహకారంతో ఐదుగురు పేదలకు నిత్యావసర సరుకులు, 200 రూపాయల డబ్బులు అందజేశారు. పాల్గొన్న ఆలిండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడారు. నిరంతరం సేవ చేస్తున్న కాకుమాని ప్రవీణ్ కుమార్‌ని చక్కా కేశవ అభినందించాను. రామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, ఇస్కాల మధు, చీదెండ్ల తిరుమలరావు పాల్గొన్నారు.

దళిత మహిళపై పెత్తందారుల దౌర్జన్యం

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలోని రెడ్డిపాలెం బజార్లో కొనుగోలు చేసిన ఎస్‌సి మహిళని ఇంట్లోకి రానివ్వకుండా స్థానిక పెత్తందారులకు చెందిన కొందరు అడ్డుకున్నారు. దీంతో నెల రోజులుగా ఇంట్లోకి పోలేక బయట ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధిత మహిళ సమస్య పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు.. రెడ్డిపాలెంలో ఉన్న ఓ ఇంటిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్న గంగోలు లక్ష్మీ ప్రసన్న ఇంటిని కొనుగోలు చేసింది. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత తన ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా సమీపంలోని అగ్రవర్ణాలకు చెందిన రామాల గోపాల్ రెడ్డి, అలేఖ్య, ప్రియాంక, సులోచన అనే వారు ఇంట్లోకి పోనీయకుండా అడ్డుకున్నారు. ఇంటికి బందోబస్తు చేశారు. దీంతో బాధితురాలు పోలీ సులను ఆశ్రయించి తన ఇంట్లోకి తనను పంపించే విధంగా న్యాయం చేయాలని వేడుకున్నారు. పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు

అదాని కష్ణపట్నం పోర్టు కృషి

ప్రజాశక్తి-ముత్తుకూరు :పర్యావరణ పరిరక్షణ కోసం ఆదాని కష్ణపట్నం పోర్టు ఎనలేని కషి చేస్తుందని ఈ హెచ్ ఎస్ డిపార్ట్మెంట్ హెడ్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఎర్త్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అదానీ కష్ణపట్నం పోర్ట్ తన ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించిందన్నారు.ఉద్యోగులచే మొక్కలు నాటడం తోపాటు సీనియర్ ఎన్విరాన్‌మెంట్ అధికారులచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించినటు తెలిపారు. ఉద్గారాలను తగ్గించడానికి హరిత విప్లవం చేపట్టామన్నారు. అదానీ కష్ణపట్నం ఓడరేవు ఇప్పటికే డీజిల్‌తో పనిచేసే క్రేన్‌లలో ఎక్కువ భాగాన్ని విద్యుదీకరించింది పునరుత్పాదక ఇంధన వనరులలో పెట్టుబడి పెట్టిందన్నారు. పోర్ట్ పర్యావరణ అధికారులు రాంబాబు, మధుసూధన్ రావు, కంటైనర్ టెర్మినల్ హెడ్ వీరేంద్ర బెల్వాల్, ఫ్రాన్సిస్, మెరైన్ -హర్షవర్ధన్, హార్టికల్చర్ ఇన్‌ఛార్జి సలీల్ శ్రీవాస్తవ్, అతని బందం అశోక్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

'మారంరెడ్డికి' నివాళి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండల సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు, టిడిపి నాయకులు మారంరెడ్డి గో పాలరెడ్డి అనారోగ్యంతో మతి చెందారు. అయన మృతిపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం గోపాల్ రెడ్డి అంతిమ యాత్రలో సోమిరెడ్డి పాల్గొన్నారు. స్వయంగా పాడి మోసి అయన పై తనకున్న అ భిమానాన్ని చంద్రమోహన్ రెడ్డి చాట్టుకొన్నారు. ఈ సందర్భంగా మామ గోపాల్ రెడ్డితో తన కున్న అనుబంధాన్ని సోమిరెడ్డి గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.తన పన్నెండేళ్ల వయస్సులోనే తమ ఇంటికి గోపాల్ రెడ్డి అల్లుడిగా వచ్చారని సోమిరెడ్డి పేర్కొన్నారు.అప్పటి నుంచి తమ పట్ల ఎంతో ప్రేమ కన బరిచే వారని పేర్కొన్నారు. గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోపాల్ రెడ్డి అంతిమ యాత్రలో రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

రాపూరు :పెంచలకోన పుణ్యక్షేత్రంలో పెనుశీల లక్ష్మి నరసింహా స్వామి మే 1 నుంచి ప్రారంభం కానున్నాయి. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ వనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యనివాహణాధికారి ఉన్నారు.

ప్రధాని మోడీని సాగనంపుదాం..

ప్రచార భేరి
ఏప్రిల్ 14 నుంచి 30 వరకు

ప్రజాశక్తి-ముత్తుకూరు :మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలోని సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోడీని సాగనంపాలని సిపిఎం సీనియర్ నాయకులు నక్క రాధయ్య డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన అప్పటి నుంచి దేశంలోనీ ప్రజలు అనేక రకాలైన ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నల్లధనాన్ని వెలికి తీస్తామని ప్రతి ఒక్కరీ అకౌంట్లో 15 లక్షల రూపాయలు జమ చేస్తామని నిరుద్యోగాన్ని రూపుమాపుతామని ప్రతి పేదవానికి విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పిస్తామని అనేక వాగ్దానాలు చేశారు. నేటికీ ఏ ఒక్క వాగ్దానం అమలు కావడం లేదు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, నాయకులు బ్రహ్మదేవు మోహన్ రావు, ఎడవల్లి సుబ్బరామయ్య, తంబి హరి, వెంకమ్మ, సుధాకర్, రమణయ్య పాల్గొన్నారు.

తోటపల్లి గూడూరులో..

తోటపల్లిగూడూరు :డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో కేంద్ర ప్రభుత్వం మను ధర్మాన్ని అమలు చేస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్ విమర్శించారు. మండలంలోని నరుకూరులో శనివారం ప్రచార భేరి జరిగింది. ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారు బోయిన రాజా అధ్యక్షతన జరిగిన ఈ ప్రచార భేరి కార్యక్రమంలో ప్రసాద్ ముఖ్య పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన,మతోన్మాద బిజెపిని సాగనంపీ దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ నాయకులు వేగూరు వెంకయ్య, కొమారి నందయ్యలు మాట్లాడారు. సిపిఎం, సిపిఐ నాయకులు పచ్చ మధు, కాల్తీరెడ్డి రమణమ్మ, గంధం వెంకటేశ్వర్లు, తలారి ఏడుకొండలు, నక్కా సూరిబాబు, శేఖర్, నరుకూరు సెంటర్ సిఐటి యు ఆటో యూనియన్ ప్రతినిధులు నాశిన పరశురామయ్య, ,శివ, గణేష్, కనకయ్య, దయాకర్ సాలిపేట ఆటో స్టాండ్ మణి. కొట్టు ముతావర్కర్ ఆలపాక సంజీవయ్య ఉన్నారు.

ముత్తుకూరులో..

ఘనంగా రంజాన్ వేడుకలు

నెల్లూరు : రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పండగ సందర్భంగా శనివారం నగరంలోని బారాషహీద్ దర్గా లోని ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనలలో రాష్ట్ర వ్యవసాయ సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

స్థానిక దర్గామిట్ట బారాషాహీద్ దర్గా వద్ద ఈద్గా ప్రాంగణంలో శనివారం పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీం సోదరులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి , ముస్లిం మత పెద్దలు, పలువురు కార్పొరేటర్లు, ముస్లిం సోదరులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బారాషాహీద్ దర్గాలో ..

రంజాన్ పండుగ పర్వదినోత్సవాన్ని పుర స్కరించుకొని రూరల్ నియాజకవర్గ పరిధిలోని బారాషాహీద్ దర్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన పార్థనా కార్యక్రమంలో రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు పాల్గొన్నారు

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి

పొదలకూరు : మండలంలోని గ్రామాల్లో శనివారం ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారు సైతం పండుగ సందర్భంగా తమ ఊరికి చేరుకున్నారు. గ్రామాల్లో మసీదులను విద్యుత్‌దీ పాలం కరణతో అలం కరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆత్మీయ ఆలిం గనం చేసుకుని శు భాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు వస్త్రదానం చేశారు.

రాపూరు : పట్టణంలోని ఈద్గాలో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక నమాజు చేశారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక నామాజు చేయించారు.

గిరిజనుడి భూమి కబ్జా

పొలంలో చెట్లు నరికివేత - గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి-గుడ్లూరు

ఓ గిరిజనుడుకు ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల పొలాన్ని కబ్జా చేసిన సంఘటన మండలంలోని చినలాటవరపిలో వెలుగు చూసింది. ఆక్రమించిన పొలంపై పట్టు సాధించేందుకు భూస్వామి రెవెన్యూ అధికారుల అండదండలతో నకిలీ పాస్ పుస్తకాలను ఆన్లైన్ చేయించుకున్నాడు. దీంతో బాధిత గిరిజనుడు కొమరగిరి మాలకొండయ్య భూమిని ఆక్రమించిన అదే గ్రామానికి చెందిన చల్లా మాల్యాద్రిని నిలదీశారు. దీంతో ఆగ్రహించిన భూస్వామి కులం పేరుతో దూషించి పొలంలో నుంచి గెంటేశాడు. పొలంలో గిరిజనుడు పెంచుకున్న వేప చెట్లను నరికివేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. దీంతో బాధితుడు అధికారులకి గ్రామ పెద్దలకి తెలిపారు. అధికారులు సైతం గిరిజనుడి మొర ఆలకించలేదు. ఫిర్యాదుని స్వీకరించలేదు. చివరికి గిరిజన సంఘం జిల్లా రాష్ట్ర నాయకుల దష్టికి తీసుకుపోవడంతో వారు బాధితుడు పొలాన్ని సందర్శించారు.ఘటనపై తహశీల్దార్ కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుని పరిశీలించిన తహశీల్దార్ పోలీసులకి సిఫార్సును చేశారు. పోలీసులు గిరిజనుడి ఫిర్యాదుని స్వీకరించకపోవడంతో స్థానిక రెవెన్యూ కార్యాలయం దగ్గర బాధిత గిరిజన కుటుంబాలకు చెందిన వారు శుక్రవారం ధర్నా చేపట్టారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, నెల్లూరు జిల్లా చైర్మన్ రాపూర్ కష్ణయ్య, అధ్యక్షులు సతీష్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపూరి మురళి, కోశాధికారి ఎల్లంపల్లి రమేష్, మహిళా అధ్యక్షురాలు, ఉపాధ్యక్షులు చేవూరు దుర్గాప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తలపుల సాంబయ్య, బాపట్ల రమేష్, బొజ్జ వెంకటేశ్వర్లు, చిన్నలాటవరపు ఎస్‌సిటి కాలనీ వాసులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

సిమెంట్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని పేడూరులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. శనివారం ఆయన పేడూరు పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. పేడూరు గ్రామ సచివాలయ పరిధిలో మంత్రి కాకాణి రూ. 29.30 లక్షలతో చేపట్టిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, తలమంచి సురేంద్ర బాబు, ఉదయ్ భాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి శేషమ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

పొదలకూరు :కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలైన పి.ఎం.జీవన్ జ్యోతి బీమా యోజన, పి.ఎం.సురక్ష బీమా యోజన వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ జిఎం ఎం. భాస్కర చక్రవర్తి తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పొదలకూరు కెనరా బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. కెనరా బ్యాంక్ జీ.ఎం భాస్కర చక్రవర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రదీప్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పొదలకూరు కెనరా బ్యాంక్ మేనేజర్ నాగనాథ్, నెల్లూరు రీజనల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆవాజ్' ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

నెల్లూరు: రంజాన్ పండుగ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆవాజ్ 4వ డివిజన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రను ఏర్పాటు చేశారు. శనివారం జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతంలోని మసీదు ప్రాంతం సమీపంలో ఈ చలివేంద్రను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో డివిజన్ అవాజ్ సభ్యులు ముజఫర్ షఫీ, సాదిక్ ఫరీద్ అల్తాఫ్ సహాయ కార్యదర్శి గౌస్ ఆవాజ్ కమిటీ సభ్యులు , జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ డి రవూఫ్,నగర ఆవాజ్ కమిటీ కార్యదర్శి రియాజ్ అహ్మద్ భాషా సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

నెల్లూరు :ఎకె నగర్ సెక్షన్ , అటోనగర్ సబ్‌స్టేషన్‌లో ఉడ్‌కాంప్లెక్స్ ఫీడర్, జ్యోతినగర్ ఫీడర్, ఆటోనగర్ ఫీడర్, వెంకటరెడ్డినగర్ ఫీడర్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర పరిధిలోని డిప్యూటి ఇంజనీర్ మన్నేపల్లి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి హేయం

ప్రజాశక్తి-కందుకూరు : చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై మంత్రి ఆదిమూలపు సురేష్ దాడికి పాల్పడం హేయమని టిడిపి నెల్లూరు పార్లమెంట్ నేత ఇంటూరి రాజేష్ ధ్వజ మెత్తారు. దళితులకు జరుగుతున్న అన్యాయంపై ఒక్కసారి అయినా మంత్రి సురేష్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందు నిరసన తెలిపి ఉంటే కొంతవరకైనా దళితులపై దాడులు ఆగి ఉండేవన్నారు. కాన్వాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపిని దళితులే వచ్చే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి రాజకీయంగా సమాధి కడతారనిహెచ్చరించారు.

ఎంఎల్‌సి శ్రీకాంత్ ఖండన

నారా చంద్రబాబు నాయుడు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ఎర్రగొండపాలెం విచ్చేయుచున్న సందర్భంగా మంత్రి ఆదిమూలం సురేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడుని అడ్డుకొని వారి కాన్వాయ్ పై రాళ్ల దాడి చేయడం హేయమైన చర్య అని పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు.

తోటపల్లిగూడూరు : యర్రగొండపాలెంలో టిడిపి అధినేత చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి మూకలు రాళ్ల దాడి చేయడం ఆ పార్టీ రౌడీయిజానికి పరాకాష్ట అని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం కమిటీ కార్యదర్శి, ఎంపిటిసి కొణతం రఘుబాబు విమర్శించారు.చంద్రబాబు కాన్వాయ్‌పై జరిగిన దాడిని శనివారం ఆయన తీవ్రంగా ఖండించారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షాలు

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలో శుక్రవారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కురిసిన వర్షం కారణంగా మండలంలోని పలుచోట్ల భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. అందులో భాగంగా సీతారామపురం ఉదయగిరి మార్గం మధ్యలోని కుడిపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై భారీవృక్షం నేలకొరిగి రోడ్డుపై పడడంతో శుక్రవారం రాత్రి నుండి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు వాహనాలు దిగి కాలినడకతో గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం శనివారం సైతం రోడ్డుపై చెట్టును తొలగించకపోవడంతో అధికారుల తీరుపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా రంజాన్ పండుగ సందర్భంగా ప్రయాణికులు తమ గమ్యస్థానానికి చేరుకోలేక ఇబ్బందులు పడ్డారు. అంతరాయాలు ఏర్పడడంతో తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. సీతారామపురం ఉదయగిరి రోడ్డు మార్గం రోడ్డు మార్గం నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి ఉండడంతో నేషనల్ హైవే అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అదేవిధంగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలోని రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు గురై పలు చెట్లు దగ్ధమయ్యాయి. ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం కలగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని పలుచోట్ల శుక్రవారం రాత్రి అకాల వర్షం, ఉరుములు, భయంకర గాలుల బీభత్సంతో చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దానితో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అందులో భాగంగా సర్వరాబాద్ గ్రామంలో గాలుల బీభత్సానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏర్పడిన విద్యుత్ సమస్యలపై వెంటనే సంబంధించిన విద్యుత్ శాఖ ఏఈ ఎస్‌కె.ఖుద్దూస్ బాషా స్పందించి వెంటనే విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి తమ సిబ్బందితో తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామంలో కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటికి సంబంధించి తొలగించడానికి ఇదివరకే ఎస్టిమేషన్లు వేసామని త్వరలోనే కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలను తొలగించి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

వాతావరణంలో మార్పు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలో శుక్రవారం రాత్రి ఏర్పడిన బీకర గాలి, ఓ మోస్తారు వర్షంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. సుమారు రెండు గంటలపాటు ప్రచండమైన గాలులు వీస్తూ ఉరుములు మెరుపులతో వాతావరణం భయాందోళనకు గురిచేసింది. గాలి పుణ్యమా అని విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఆరుబయట నిద్రించలేక ఇంట్లో ఉండలేక ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురి అయ్యారు. వృద్ధులు, చిన్నపిల్లలు, పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. మండలంలోని 24 పంచాయతీలలో ఇదే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ లేని కారణంగా ఛార్జింగ్ లేక సెల్‌ఫోన్లు మూగబోయాయి. పలు ప్రాంతాలలో మామిడి పంట నేలరాలింది. చింతకాయల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. వాతావరణ సమతుల్యం దెబ్బతినడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

మండలంలోని నలపరెడ్డిపల్లి ఎస్‌సి కాలనీలో సిసిరోడ్డు ఆత్మకూరు నియోజకవర్గం వైసిపి ఎస్‌సిసెల్ కన్వీనర్ ఎర్రగుంట పెంచలయ్య ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌సిసెల్ కన్వీనర్ ఎర్రగుంట పెంచలయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఎస్‌సి ఎస్‌టి కాలనీల అభివృద్ధికి నోచుకోక దగాకు గురవుతున్న తరుణంలో మన జగనన్న ప్రభుత్వంలో ఈ పనులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బట్టేపాడు వైసిపి నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, తోటపల్లి రవికుమార్ రెడ్డి, వార్డు మెంబర్లు పెండం పెంచలమ్మ, ఉదయగిరి పెంచలయ్య, వాలంటీర్లు గృహసారథి వై.అనూష, ముంతా బాలకృష్ణ, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సముద్రంలో ఈతకెళ్లి యువకుడి గల్లంతు

ప్రజాశక్తి-కావలి

కావలి మండలం తుమ్మలపెంట బీచ్‌లో ఈత కోసం దిగి మహేంద్ర అనే యువకుడు గల్లంతైన సంఘటన శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. 11 మంది మిత్రులతో కలిసి తుమ్మలపెంట బీచ్ సముద్రంలో వాయల మహేంద్ర (16) ఈతకోసం వెళ్లాడు. తిరిగి రాలేదు. ఘటన స్థలానికి మెరైన్ పోలీసులు చేరుకొని విచారిస్తున్నారు. గల్లంతైన యువకుడు కోసం సముద్రంతీరం వెంట గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడు మహేంద్ర తుమ్మలపెంట గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఈద్గాలలో, మసీదులలో ప్రార్థనలు చేయగా మహిళలు ఇళ్లలో ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసంలో నెల రోజులపాటు కఠోర ఉపవాసాల ఉండి ఈ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దీక్షలు విరమించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ప్రజాశక్తి-జలదంకి : మండలంలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంజాన్ సందర్భంగా మండల కేంద్రం జలదంకి, గట్టుపల్లి, అన్నవరం, చిన్నక్రాక, బ్రాహ్మణ క్రాక మసీదులలో ప్రత్యేక వేడుకలు జరుపుకున్నారు. రంజాన్ మాసం సందర్భంగా పలువురు నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి రంజాన్ పర్వదినం విరమించారు. ఈ సందర్భంగా హిందువులు కూడా ముస్లిములకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈద్ ముబారక్ అంటూ ఆ లింగణం చేసుకుని మిఠాయిలు తినిపించారు. ముస్లిం కాలనీలలో ఉదయం నుండి సాయంత్రం వరకు పండుగ వాతావరణం నెలకొంది.

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నెలవంక కనిపించడంతో శనివారం రంజాన్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. సీతారామపురంలోని తురకపాలెం వద్ద ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని మసీదులు ఈద్గాలలో రంజాన్ మాస చివరి రోజు వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రజాశకి-ఎఎస్‌పేట : ముస్లిముల పవిత్ర రంజాన్ పండుగ ఈద్–ఉల్–ఫితర్ నమాజ్‌ను మండల కేంద్రమైన ఎఎస్‌పేట (రహమతాబాద్) లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గా ఆవరణంలోని పెద్ద మసీదులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నమాజ్ అనంతరం హజరత్ వారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నమాజ్ తరువాత ముస్లిం సోదరులు పిల్లలు పెద్దలు సంతోషంగా ఒకరికొకరు అలింగం చేసుకుంటూ ఈద్ ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా పిల్లలు పెద్దలు కొత్త దుస్తులు ధరించి మసీదుల వైపు పయనమయ్యారు. వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో పండుగ సందర్భంగా దర్గా మసీదు వద్ద భక్తుల కొరకు దర్గా ఈవో మొహమ్మద్ హుస్సేన్ అన్ని ఏర్పాట్లను చేశారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు రంజాన్ పండుగను దృష్టిలో పెట్టుకొని దర్గా వద్ద సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిఐ ఎం.రవి నాయక్ అధ్వర్యంలో ఎఎస్‌పేట, సంగం ఎస్‌ఐలు నరేష్, నాగార్జునరెడ్డి వారి సిబ్బంది ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ఆత్మకూరులోని ఈద్గా వద్ద మైనారిటీలతో కలిసి ఈదుల్ ఫితర్ నమాజులో ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో అలింగణం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట వైసిపి పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనందరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, ఇందూరు వెంకటరమణారెడ్డి, మైనారిటీ నాయకులు ముజ్జు, రహీం, జమీర్, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, పొడమేకల పెంచలయ్య, తదితరులున్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల అనంతసాగరం, ఉప్పలపాడు, దేవరాయపల్లి, కంభంపాడు గ్రామాలలోని ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెలరోజులు ఉపవాసం ఉండి మసీధుల్లో ప్రార్థనలు చేసి దీక్ష విరమించారు.

జిల్లాలో హోరెత్తుతున్న 'ప్రచార భేరి'

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ప్రచార భేరి హోరెత్తుతుంది. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా సిపిఎం, సిపిఐ పార్టీల శ్రేణులు జిల్లాలోని 36 మండల కేంద్రాల్లో నిరాటంకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బిజెపిని ఇంటికి సాగనంపాలంటూ ప్రచారం చేస్తున్నారు. దాదాపుగా 15 రోజుల పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించి కార్మిక దినోత్సవం నాడు నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళిక రచన చేసి ఆదిశగా వామపక్ష పార్టీలు ఆడుగులు వేస్తున్నాయి. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తుందంటూ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడాన్ని తప్పుబట్టారు. రానున్న ఎన్నికల్లో బిసిల సత్తాను చాటుకోవాల్సిన అవసరం ఉందంటూ నగరంలో భారీ స్థాయిలో బిసిల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధికార పార్టీ ప్రతినిధులు తప్ప మిగిలిన అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బిసి నాయకులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 79వ జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ఆశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రమాధ తీవ్రతను తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సమయం సమీపిస్తున్న తరుణంలో జిల్లా వ్యాప్తంగా పార్టీల సమీకరణల్లో అనుహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు వచ్చి వెళ్లిన అనంతరం అధికార పార్టీకి చెందిన నాయకులపై ప్రతిపక్షనాయకుల మాటల తూటాలు పేలుతున్నాయి. ఇదిలా ఉంటే మరి కొంత మంది పార్టీ తనకు టికెట్ ఇస్తుందని, అసెంబ్లీకి తానే పోటీ చేస్తానని, విజయం తప్పకుండా తమను వరిస్తుందంటూ ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుకుంటున్నారు. ఎన్నికల్లో విజయం ఏ పార్టీని వరిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్న గిరిజనులపై బెదిరింపులు

ప్రజాశక్తి-కొడవలూరు

గిరిజనులతో మాట్లాడుతున్న నాయకులు

కొడవలూరు ఎన్టీఆర్ నగర్ జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలను స్థానికులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. వైసిపి నాయకులు నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ స్థానిక గిరిజనులపై దాడికి యత్నించారు. రాత్రి 10 గంటలకు స్థానిక పోలీసులు ఇద్దరినీ సమన్వయపరిచారు. కొడవలూరు పోలీస్ స్టేషన్లో గ్రామస్తులందరూ కలిసి గ్రావెల్ అక్రమ రవాణా పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..జనసేన పార్టీ తరపున గ్రావెల్ తవ్వకాలను ప్రశ్నించడం చూసి ధైర్యంగా నిన్న రాత్రి గ్రావెల్ రవాణాను నిలిపామన్నారు. మహిళలను బూతులు తిడుతూ "యానాదులు మీకెందుకురా" ఈ గొడవలు అని తిట్టిపోశారు. తాము చల్లా యానాదులమే మమ్మల్ని చంపి మా శవాలపై ఈ గ్రావెల్ తీసుకొని పొండి అని మొండిగా నిలబడ్డామన్నారు. ప్రాణం పోయినా ఇక్కడి నుంచి లారీ పోనివ్వమన్నారు. పోలీసులకు రిపోర్ట్ ఇచ్చామన్నారు. వైసిపి నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నారన్నారు. ఇళ్లు ఖాళీ చేపిస్తామని బెదిరిస్తున్నారన్నారు. న్యాయపరంగా పార్టీ తరపున మీరు అండగా నిలబడాలని జనసేన నాయకులు గునుకుల కిషోర్,సుధీర్ బద్దెపూడి ని కోరారు.జనసేన పార్టీ తరపున అండగా నిలబడతామన్నారు. ఈ విషయాన్ని అధిష్టానం దష్టికి తీసుకెళ్తామని న్యాయపరంగా గిరి జనులకు అండగా ఉండి జరగతున్న అన్యాయాన్ని ప్రతిఘటిస్తామని జనసేన నాయకులు తెలిపారు.

చైర్మన్‌ను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ రామిరెడ్డి

చైర్మన్‌కు ఎంఎల్‌ఎ అభినందనలు

ప్రజాశక్తి-అల్లూరు

స్థానిక పడమర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం నూతన త్రిశభ్య కమిటీ చైర్‌ర్మన్ బత్తల భక్తవత్సల రెడ్డిని ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలలో రైతులకు విస్తృత సేవలు అందించాలని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రైతులకు విరివిగా అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్‌చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నీలం సాయికుమార్ తదితరులున్నారు.

'డిబిఎస్' అధ్యాపకుడి ప్రతిభ

ప్రజాశక్తి-కావలి

స్థానిక డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్, ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎస్.నాగ కిషోర్ అమరావతిలో ఉన్న విట్ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) లో జరిగిన అంతర్జాతీయ పరిశోధన పత్రాల ప్రదర్శన సదస్సులో ప్రతిభ కనబరిచారు. ఆయన పరిశోధన పత్ర ప్రదర్శనను విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వి.అనిల్ కుమార్ విశేషంగా ప్రశంసించడం గమనార్హం. ఈ పరిశోధన పత్రానికి సంబంధించి ప్రస్తుత విద్యుత్ కర్మాగారాలలో వినియోగించాల్సిన అత్యవసర సి.ఎఫ్.బి.సి టెక్నాలజీపూ ఎస్.నాగ కిషోర్ ఈ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈ పరిశోధన వల్ల జాతీయ ఇంధన వినియోగం పెరిగి ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే ఇంధనాన్ని భారీగా తగించుకోవచ్చని తెలిపారు. అంతేగాక కాల పరిమితి ముగిసిన విద్యుత్ కేంద్రాలను మరో 20 నుండి 25 సంవత్సరాల వరకు అతితక్కువ ఖర్చుతో పునరుద్ధరించవచ్చని వివరించారు. ఈ పరిశోధన పత్ర ప్రదర్శన అనంతరం ప్రశంసల వెల్లువ రావడం అధ్యాపకుని ప్రతిభకు తార్కాణం. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు, తోటి అధ్యాపకుల బృందం ఆయనను అభినందించారు.

ప్రధాని మోడీని గద్దె దింపాలి

మాట్లాడుతున్న గంటా లక్ష్మీపతి

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను అనుసరిస్తున్న ప్రధాని మోడీని ఇంటికి సాగనంపాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మురుగళ్ల ఎస్‌సి కాలనీలో ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయాన్ని తెస్తున్న ప్రభుత్వంగా సంస్థలన్నింటినీ తన ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విత్తనాల వల్లే దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని తెలియజేశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రజలకు చేసిన విభజన హామీలు అమలు చేయకుండా ఏపీని అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మురగళ్ల శాఖ కార్యదర్శి రాము, నాయకులు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోనె దయాకర్

ప్రజాశక్తి-కొడవలూరు : బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు సీపీఎం ఆధ్వర్యంలో కొడవలూరు మండలం యల్లాయపాళెంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో సిపిఎం కరపత్రాలు పంచుతూ బీజేపీ వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్, యల్లాయపాళెం సిపిఎం కార్యదర్శి వడ్లపూడి నరసయ్య, భూలోకం కాంతారావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-జలదంకి

సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు పాలవల్లి మాలకొండారెడ్డి అన్నారు. మండలంలో శనివారం అన్నవరం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. దీనితో సిఎం జగన్మోహన్ రెడ్డిపై అన్ని వర్గాల ప్రజల సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత ప్రజల సంక్షేమ అభివృద్ధి గురించి పట్టించుకుందని ఒక్క వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు.

జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చెప్పి వారి ఇంటికి స్టిక్కర్లు అంటించారు. టిడిపి హయాంలో మాజీ సిఎం చంద్రబాబు నాయుడు బూటకపు వాగ్దానాలతో ప్రజలను తగా చేశారని ఆరోపించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు వారి అభివృద్ధికి బాసటగా నిలుస్తామని తెలిపారు. అన్ని సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దామెర్ల దేవదాసు, ఆలూరి లక్ష్మీనరసారెడ్డి, వైసిపి నాయకులు గుమ్మిడి రమేష్, వార్డు మెంబర్లు, గృహసారథులు, వాలంటీర్లు మనోహర్, మధు, రవి, శ్రీకాంత్, మనిషా, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా లేఅవుట్లు వేస్తే చర్యలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని 24 పంచాయతీల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా లే అవుట్లను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రెవెన్యూ సిబ్బంది హెచ్చరించారు. అందులో ఎవరైనా గానీ అక్రమంగా లేవటం నిర్వహిస్తే పంచాయతీల పరంగా చర్యలు తప్పవన్నారు. అందులో భాగంగా 548–2లో అక్రమంగా లేఅవుట్లు నిర్వహిస్తున్న యజమానులకు రెవెన్యూ సిబ్బంది చట్టపరమైన అధికార పరంగా లేవట్లు నిర్వహించాలని లేకపోతే చర్యలు తప్పవని వారికి సూచించారు. ఇంకెవరైనా అక్రమ లేఅవుట్లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రెవెన్యూ సిబ్బంది హెచ్చరించారు.

భోజన ప్యాకెట్లు అందజేస్తున్న సరేంద్ర

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం కచ్చేరి మిట్ట నివాసి అళహరి రామయ్య సతీమణి అళహరి.రంగనాయకమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు అళహరి రామక్రిష్ణ సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో శనివారం శివరామ సుబ్బయ్య కాలనీలోని పేదలకు, ఉదయగిరి బ్రిడ్జి కింద ఉన్న పేదలకు బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమసంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాత అళహరి.రామక్రిష్ణకి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

చంద్రబాబుపై రాళ్ల దాడి అమానుషం : టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు

ఇటీవల కాలంలో ప్రభుత్వంపై ప్రజలలో వస్తున్న వ్యతిరేకత ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ప్రజలు నీరాజనం పడుతుండడం చూసి ఓర్వలేని ప్రభుత్వం పెద్దలు ప్రతిపక్షనేత సభలపై పర్యటనలపై రాళ్లదాడులు కుట్రలు పన్నడం అమానుషమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు ఆరోపించారు. శనివారం ఆయన ఆ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. టిడిపికి రాష్ట్రంలో వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని ప్రభుత్వ పెద్దలు ఎలాగైనా ర్యాలీలను సభలను విచ్చిన్నం చేయాలన్న ఉద్దేశంతో బరితెగిస్తూ ఉండడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. రాష్ట్రంలోని దళితులకు ముఖ్యమంత్రి తీవ్ర అన్యాయం చేస్తున్నారని దళిత సోదరులు ఆ విషయాన్ని గమనిస్తున్నారన్నారు. ఇటీవల టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఎర్రగొండపాలెంలో ర్యాలీపై జరిగిన దాడి తాడేపల్లి కుట్రలో భాగమే అన్నారు. ఎస్‌పిజి వలయంలో ఉన్న నేతపై దాడి జరిగిందంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయనడానికి నిదర్శనమన్నారు. దళితులను ఓటు బ్యాంకులుగా వాడుకుంటూ వారికి అనేక రకాలుగా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దళితులకు గత ప్రభుత్వ ఇచ్చిన 27పథకాలను జగన్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధంగా ఉన్న ఎస్‌సి కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఎస్‌సిలకు రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేశారని 50వేల బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా నిలిపివేశారని తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు. అనేకమంది దళిత నాయకులపై ప్రభుత్వం కక్ష సాధించి హింసించిందన్నారు. వీటన్నింటిపై గవర్నర్ విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకటరామారావు

ప్రజాశక్తి-కలిగిరి : మాజీ సిఎం చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై రాళ్ల దాడి చేయడం జగన్‌రెడ్డి అరాచకు పాలనకు నిదర్శనమని మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. శనివారం కలిగిరి పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై రాళ్ల దాడి.. రాజకీయానికి పరాకాష్ట అని తెలియజేశారు. చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాస్పందన చూసి జగన్ రెడ్డిలో ఫ్రస్టేషన్ పెరిగిపోయి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. యథా లీడర్.. తథా కేడర్.. అన్నట్టు జగన్ రెడ్డినే ఆదర్శంగా తీసుకుంటున్న వైసిపి మంత్రులు, ఎంఎల్‌ఎలు ఎంతకైనా బరితెగించి నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు పర్యటనలో దాడి జరిగే అవకాశం ఉందని, భద్రత పెంచమని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యలు డిజిపికి, ప్రకాశం జిల్లా ఎస్‌పికి లిఖిత పూర్వక లేఖలు రాసినా కూడా ఎందుకు పట్టించుకోలేదన్నారు. ప్రతిపక్షనేతకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై లేదా అని ప్రశ్నించారు. మంత్రి ఆదిమూలపు సురేష్ అర్ధనగ్న ప్రదర్శన చూస్తే ప్రజాస్వామ్యమే సిగ్గుపడుతోందని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి మెప్పు కోసం మరీ ఇంతలా దిగజారాలా తాడేపల్లి ప్యాలెస్, ఐప్యాక్ చెప్పిన దానికల్లా తలూపుతున్నారని విమర్శించారు. జగన్ రెడ్డి పాలనలో నాలుగేళ్లుగా దళితులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోని ఆదిమూలపు అదే దళితుల హక్కుల కోసం పోరాడుతున్న చంద్రబాబుపై విషం చిమ్మడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి రౌడీ రాజకీయాలతో తమను భయపెట్టాలనుకుంటే అదే పగటి కలే అవుతుందని తెలిపారు. జగన్‌రెడ్డి కోడికత్తి డ్రామాలకు భయపడేవాళ్లు ఇక్కడెవరూ లేరని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నియంతల ఆగడాలు సాగవన్నారు. జగన్ రెడ్డిలా ఎగిరెగిరి పడిన ఎంతోమంది కాలగర్భంలో కలిసిపోయారని తెలియజేశారు. జగన్‌రెడ్డి అరాచకపాలనపై ప్రజలు కూడా ఆలోచన చేయాలని సూచించారు. ప్రజల మద్దతుతో రాక్షస పాలనకు చరమగీతం పలుకుతామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బిజ్జం కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాకు మహేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు చీమల తాతయ్య, కల్లూరి చంద్రమౌళి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి జయరామిరెడ్డి, పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి పివి సుబ్బారావు, యూనిట్ ఇన్‌ఛార్జులు ఊసా మాల్యాద్రి, బోగ్గవరపు వేణు, గంగవరపు మధన్, సర్పంచులు పూసాల వెంగపనాయుడు, వరప్రసాద్, మాధవ్, పట్టణం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడుపై వైసిపి అల్లరి మూకల రాళ్ల దాడిని టిడిపి బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పుటూరి బాలగురు స్వామి ప్రకటనలో ఖండిం చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిన్న యర్రగొండపాలెంకి "ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి" ప్రోగ్రామ్‌కి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు నారా చంద్రబాబు నాయుడుపై రాళ్ల దాడి చేయించడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయించడమేనన్నారు. లోకేష్‌బాబు మాటలు మార్ఫింగ్ చేసి, తప్పు చేసింది గాక చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని మంత్రిగా ఉండి ఆదిమూలపు సురేష్ చొక్కావిప్పి, రెచ్చగొట్టి వైసిపి అల్లరి మూకలతో రాళ్ళ వేయించడం దారుణమన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల)

మండలంలో పాడేరు సచివాలయం పరిధిలోని చీర్లవారికండ్రికలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి సూచనల మేరకు చేజర్ల మండల వైసిపి కన్వీనర్ తూమాటి విజయభాస్కర్ రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాయా, సంతోషంగా ఉన్నారా అని తూమాటి విజయభాస్కర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ క్రాంతిపథం డిఆర్‌డిఎ సి.సుజీవన, సిసిఎన్ పుల్లయ్య, ఇరిగేషన్ ఎఇ సురేష్, విఆర్‌ఒ కె.లక్ష్మీనరసింహ ప్రసాద్, విఒఎ అనిత, గ్రామస్తులు, నాయుకులు సానా రమణయ్య, పంకు నాగేశ్వరరావు, సానా శ్రీనివాస రెడ్డి, జి.రామచందయ్య, ఆనంద్ రెడ్డి, సుధీర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి గణేష్, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-జలదంకి

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసిపికి భారీ మెజారిటీ సాధించేందుకు, అన్ని గ్రామాల్లో అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేస్తానని మండల నాయకుడు ఇస్కా మధన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా జలదంకి మండలంలో పార్టీకి భారీ ఆధిక్యత ఖాయమని తెలిపారు. మండలంలో తన తండ్రి ఇస్కా వెంకటరామిరెడ్డి వర్గం మొత్తం ఎల్లప్పుడు పార్టీకి విధేయులుగా ఉండి భారీ ఆధిక్యం వైసిపి సొంతం చేసేందుకు అలుపెరుగక కష్ట పడతామన్నారు.

26న పాత కంప్యూటర్లు వేలం

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం తుమ్మలపెంట ఎపి గర్ల్స్ రెసిడెన్సియల్ స్కూల్‌కు చెందిన పాత కంప్యూటర్లు 26న వేలం వేస్తున్నామని స్కూల్ ప్రిన్సిపాల్ పద్మావతి ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు "ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, తుమ్మలపెంట" పేరుతో కావలి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో రూ.5వేలు డి.డి. రూపంలో తీసుకుని 26న జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866559641 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.